ఇన్ఫోగ్రాఫిక్

# కొత్త కాంతుల సంక్రాంతి

**కాలగతిని శాసించే సూర్య భగవానుడు ఉత్తర దిశగా ప్రయాణం మొదలుపెట్టే పర్వం మకర సంక్రాంతి. ఈ రోజున దక్షిణ భారతదేశంలో సూర్యుడికి పొంగలి నివేదిస్తారు. ఉత్తర దేశంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. పిల్లా పెద్దా తేడా లేకుండా పతంగులు ఎగరవేస్తారు. స్త్రీలు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటారు. వ్యవసాయంలో రైతుకు సాయంగా ఉండే పశువులకూ సంక్రాంతి కూడా పండుగ వేళే! భారతదేశంలో ఏ ప్రాంతంలో సంక్రాంతిని ఎలా జరుపుకొంటారో తెలుసుకుందాం.**

## తెలంగాణ-ఆంధ్రప్రదేశ్

**తెలుగు** రాష్ట్రాల్లో సంక్రాంతిని భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమగా నాలుగు రోజులు జరుపుకొంటారు. భోగి మంటలు, పొంగలి నివేదన, భోగిపండ్లు, పశువుల అలంకరణ, వాయనాలు ఇచ్చిపుచ్చుకోవడం ఇక్కడి ప్రత్యేకతలు.

## అసోం

భోగాలి బిహు లేదా మాఘ్ బిహుగా పిలుస్తారు. ఇక్కడ కూడా సంక్రాంతి పంటల పండుగే. మేజి పేరుతో మంట వేసి అగ్ని దేవుణ్ని ప్రార్థిస్తారు. ఇండ్లలో మిఠాయిలు చేసుకుంటారు.

## ఉత్తర్‌ప్రదేశ్

ఇక్కడ కిచిడీ పర్వ్ పేరుతో సంక్రాంతిని జరుపుకొంటారు. ప్రయాగలోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. ఇండ్లలో కిచిడీ వండి సూర్యుడికి నివేదిస్తారు.

## గుజరాత్

ఇక్కడ సంక్రాంతిని ఉత్తరాయణ్ పేరుతో నిర్వహిస్తారు. పతంగులను ఎగరవేస్తూ ఉల్లాసంగా గడిపేస్తారు.



## కర్ణాటక

ఈ రాష్ట్రంలో సుగ్గి అని పిలుస్తారు. తెల్ల నువ్వులు, వేయించిన పల్లీలు, ఎండు కొబ్బరి తురుము, బెల్లంతో చేసిన మిఠాయిలను బంధువులతో ఇచ్చిపుచ్చుకునే 'ఎల్లు బిరొదు' ఆచారం ఇక్కడ ఉంది.

## తమిళనాడు

ఈ రాష్ట్రంలో సంక్రాంతిని 'పొంగల్' అని పిలుస్తారు. భోగి, పొంగల్, మాట్టు పొంగల్ పేరుతో సంక్రాంతి సంబురాన్ని మూడు రోజులు జరుపుకొంటారు.

## మహారాష్ట్ర-గోవా

ఈ రెండు రాష్ట్రాల్లో మకర సంక్రాంతిని మాఘి సంక్రాంత్ అనీ, హల్దీ కుంకుమ్ అనీ పిలుస్తారు. వేడుకలు 15 రోజులపాటు జరుగుతాయి. పెళ్లయిన స్త్రీలు తమ జీవితాలు సుఖసంతోషాలతో సాగిపోవాలని కోరుకుంటూ ఒకరికొకరు పసుపు కుంకుమలు ఇచ్చుకుంటారు.

## పశ్చిమబెంగాల్

ఇక్కడ సంక్రాంతిని పౌష్ సంక్రాంతిగా పిలుస్తారు. గ్రామాల్లో ఇండ్ల ముందు అందమైన ముగ్గులు తీర్చిదిద్దుతారు. మామిడాకుల తోరణాలు కట్టి లక్ష్మీదేవిని ఇళ్లకు ఆహ్వానిస్తారు.

## హిమాచల్‌ప్రదేశ్

మాఘ సాజీగా పిలుస్తారు. ఓ మట్టిపాత్రలో అన్నం వండుతారు. పతంగులు ఎగరవేస్తారు.



## పంజాబ్

ఈ రాష్ట్ర రైతాంగం సంక్రాంతిని లోహ్రి పేరుతో జరుపుకొంటారు. పంటకోతలకు ముందు అగ్ని దేవుడిని తమకు మంచి దిగుబడులు ప్రసాదించాలని ప్రార్థిస్తారు. 'ఆడార్ ఆయే దిలాతేర్ జాయే' (గౌరవం రావాలి.. పేదరికం పోవాలి) అని ఉచ్చరిస్తూ అగ్ని చుట్టూ తిరుగుతారు.

## రాజస్థాన్-ఢిల్లీ-హరియాణా

ఈ రాష్ట్రాల్లో సక్రాత్ (ఢిల్లీ, హరియాణా), సుక్రాత్ (మధ్యప్రదేశ్), సక్రాత్ (రాజస్థాన్) అని పిలుస్తారు. సూర్యుడిని ప్రార్థిస్తారు. నువ్వులు ప్రధానంగా మిఠాయిలు తయారుచేసుకుంటారు.

## ఒడిశా

ఈ రాష్ట్రంలో మకర చౌలా పేరుతో సంక్రాంతిని జరుపుకొంటారు. మకర చౌలా అంటే.. చక్కెర, అరటిపండు, కొబ్బరి, మిరియాలతో చేసిన తియ్యటి అన్నం. కోణార్క్ సూర్య దేవాలయానికి వెళ్లి పూజలు చేస్తారు.

## కశ్మీర్

జమ్ము, కశ్మీర్ ప్రాంతాల్లో శిశుర్ సంక్రాత్‌గా జరుపుకొంటారు. మాఘి సంక్రాంత్ అని కూడా పిలుచుకుంటారు.